క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ



రొట్టె, గుడ్డు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులు, బాలింతలకు ఆదివారం ఆదరణ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో పౌష్టికాహార పంపిణీ జరిగింది. క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు ఆదాం ఆర్థిక సాయంతో వారికి రొట్టె, పప్పు గుడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు జాన్ ప్రభాకర్, సభ్యులు ప్రవీన్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవే ధ్యేయం



ఉచిత అంబులెన్సును ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ ఇన్‌స్టాలేషన్ అధికారులు, సభ్యులు

బేతంచెర్ల: సమాజసేవే రోటరీ క్లబ్ ధ్యేయమని క్లబ్ ఇన్‌స్టాలేషన్ అధికారులు కేశవ రెడ్డి, శ్రీరామమూర్తి తెలిపారు. ఆదివారం పట్టణంలోని రోటరీ క్లబ్‌లో 2024–25 సంవత్సరం నూతన అధ్యక్షులుగా వీరారెడ్డి, కార్యదర్శి ప్రశాంత్‌తోపాటు సభ్యులుగా లోకేష్ గుప్త, రాధా స్వరూప్, సత్తార్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రోటరీ క్లబ్ తరపున ఉచిత అంబులెన్సు సేవలను ప్రారంభించారు. రెండవసారి క్లబ్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు క్లబ్ సభ్యులందరికీ నూతన అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు రామేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, సభ్యులు గుండాగోపాల్, విజయనాగరాజు, శేషఫని, రామూర్తి, వెంకటేశ్వర్‌రెడ్డి,ఫయాజ్ పాల్గొన్నారు.

10న ఆశా వర్కర్ల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లయ్య

బేతంచెర్ల: ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఈనెల 10వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, ఆశా వర్కర్స్ పట్టణ కార్యదర్శి నాగేంద్రమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు లావణ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు సంధ్యా రాణి, నాగేశ్వరి, రామేశ్వరి, రామలక్ష్మి, రమణమ్మ, సరోజమ్మ పాల్గొన్నారు.

గో సంరక్షణ ప్రతి హిందువు బాధ్యత



మాట్లాడుతున్న యాదగిరిరావ్

బనగానపల్లె : గో సంరక్షణ ప్రతి ఒక్క హిందువు బాధ్యతగా భావించాలని క్షేత్ర దక్షణాద ప్రాంత క్షేత్ర గో రక్షా ప్రముఖ్ యాదగిరిరావ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని యాగంటి క్షేత్రంలో విశ్వహిందూపరిషత్ దక్షణాంధ్ర ప్రాంత గోరక్షా సమావేశం జరిగింది. యాదగిరిరావ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గో ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గోవధ, అక్రమ రవాణను అడ్డుకోవాలన్నారు. కబేళాల పై ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, గోవధ నిషేధ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దక్షణాదిప్రాంత గో రక్షా ప్రముఖ్ బ్రహ్మానంద రెడ్డి, సహాయ కార్యదర్శి కోటేశ్వరావు, జిల్లా సహాయ కార్యదర్శి కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూరాన్ మసీదు కమిటీ ఎన్నిక

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని నూరాన్ మసీద్‌లో ఆదివారం ముస్లిం సోదరులు కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ప్రెసిడెంట్‌గా హుసేన్‌బాషా, వైస్‌ప్రెసిడెంట్‌గా బాబా ఫ్రక్రుద్దీన్, సెక్రటరీగా పుల్లయ్య, జాయింట్ సెక్రటరీగా మహబూబ్‌ఖాన్, ట్రెజరీ ఉశేన్‌పీరాతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం విరాళం

డోన్ : వృద్ధులకు ఆశ్రయం కల్పించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆదరణ వృద్ధాశ్రమ నిర్వాహకులకు స్ఫూర్తి సేవా సమితి చేయూతనిచ్చింది. దాత తిరుమలేష్ అందించిన బియ్యం ప్యాకెట్లను ఆదివారం సమితి అధ్యక్షులు సీసంగుంతల మధు ఆశ్రమ నిర్వాహకులు విజయలక్ష్మి, అమ్ములుకు అందజేశారు.

ఇంకెప్పుడు?

- పాఠశాలలు పునఃప్రారంభించి నెలవుతున్నా అందని యూనిఫాం
- గతేడాది మొదటిరోజే పంపిణీ చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు



ప్యాపిలి: టీడీపీ ప్రభుత్వంలో మళ్లీ విద్యార్థుల సమస్యలు మొదటికి వచ్చాయి. జూన్ 13న పాఠశాలలు పునఃప్రారంభమైనా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు కూడా అందలేదు. ఇక యూనిఫాం ఊసేలేదు. దీంతో విద్యార్థులకు ఎదురు చూపులు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలను కల్పించింది. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసిన మాజీ సీఎం జగన్ ప్రభుత్వంలో విద్యా కానుక పేరిట కిట్లు పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే పంపిణీ సాగేది. కిట్లలో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు ఉండేవి. అయితే గత సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు కావస్తోంది. అలాగే పాఠశాలలు పునః ప్రారంభమై దాదాపు నెల కావస్తుంది. జగనన్న విద్యా కానుక పేరును మార్చిందేకాని విద్యార్థులకు యూనిఫాం అందజేయలేకపోయింది టీడీపీ ప్రభుత్వం. కిట్లలో కేవలం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఇతర వస్తువులు ఉన్నాయి. యూనిఫాం మాత్రం లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

యూనిఫాం కోసం ఎదురు చూపులు

పేద, ధనిక తారతమ్యం ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం తప్పనిసరి చేసింది. అయితే పంపిణీలో టీడీపీ ప్రభుత్వం జాప్యం చేస్తుంది. మండలంలో 64 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా 1 నుంచి 10 వ తరగతి వరకు 6,700 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులందరికీ ప్రభుత్వం రెండు జతల యూనిఫాంకు సరిపడా బట్ట (క్లాత్) పంపిణీ చేసి కుట్టు కూలీ కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే మండలంలో 6,700 విద్యార్థులకు గాను ఇప్పటికీ ఒక విద్యార్థికి కూడా యూనిఫాం క్లాత్ పంపిణీ చేయలేదు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అడుగుతున్నా స్పష్టమైన సమాధానం కరువైంది. అసలు యూనిఫాం క్లాత్ ఇస్తారా..ఇవ్వరా అనే సందిగ్ధత నెలకొంది. ఇదివరకే పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు గతేడాది ఇచ్చిన యూనిఫాంతో సరిపెట్టుకుంటున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏమటనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు సామాన్యులు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూనిఫాం పంపిణీకి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


వారంలో పంపిణీ చేస్తాం



విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీ చేస్తున్నాం. అయితే కిట్లలో యూనిఫాం క్లాత్ రాలేదు. నంద్యాల జిల్లాలో కొన్ని మండలాలకు మాత్రమే యూనిఫాం వచ్చినట్లు తెలిసింది. ప్యాపిలి మండలానికి రావాల్సి ఉంది. యూనిఫాం మరో రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. యూనిఫాం రాగానే అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తాం. సాధ్యమైనంత వరకు ఈ వారంలోనే విద్యార్థులకు పంపిణీ చేస్తాం.

– వెంకటేశ్ నాయక్, ఎంఈఓ

నేడు మహానేత వైఎస్సార్ జయంతి



డోన్ : మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో ఉదయం 9 గంటలకు మహానేత చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం పట్టణంలోని వైఎస్‌ఆర్ విగ్రహాల చెంతకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించనున్నారు.

కొలిమిగుండ్ల: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పాల్గొని కేక్‌కట్ చేస్తారని చెప్పారు. అదేవిధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు,కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

బేతంచెర్ల: దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం 9గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు.

యాగంటి క్షేత్రానికి కలశాలతో పాదయాత్ర



కలశాలతో యాగంటిక్షేత్రానికి చేరుకున్న భక్తులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన హట్టిముని స్వామి ఆలయం నుంచి విశ్వహిందూపరిషత్, ధార్మిక మండలి, హట్టిముని స్వామి దేవస్థానం కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం జల కలశాలతో భక్తులు యాగంటి క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లారు. ఉదయం వివిధ గ్రామాల నుంచి హట్టిముని స్వామి ఆశ్రమం వద్దకు చేరుకున్న భక్తులు అక్కడి నుంచి కలశాలను తలపై పెట్టుకొని శివనామస్మరణ భజన చేసుకుంటూ పాదయాత్రగా యాగంటిపల్లె, సాదుకొట్టం, పాతపాడు గ్రామాల మీదుగా యాగంటి క్షేత్రం చేరుకున్నారు. వీరికి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివుడికి కలశాలల జలంతో అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని స్వామివారిని కోరుకున్నారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమామహేశ్వర స్వామి నిత్యాన్నదాన, రైతు అన్నదాన సంస్థలు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సంఘటనా కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు, గీతా సంఘం సభ్యులు శివన్న, గంగ భవాని, విజయభారతి, మల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపా డు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపా డు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటిపూట వేళల్లో తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల విద్యుత్ సరఫరా వేళలు వివరించారు. ముక్కమల్ల, వసంతాపురం, కమలపురి, ఆల్వకొండ, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, అక్కంపల్లె, రామిరెడ్డిపల్లె, ముక్కమల్ల, కానాల, ముదిగేడు, రెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె తదితర ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ తెలిపారు.

కనిపించిన నెలవంక...ప్రారంభమైన మొహర్రం



హజరత్ అబ్బాస్‌పీర్లకు ఫాతెహాలు సమర్పిస్తున్న నవాబు వంశీయులు



విద్యుత్ దీపాలంకరణలో ఆస్థానం

బనగానపల్లె రూరల్: నెలవంక ఆదివారం సాయంత్రం కనిపిచడంతో మండల కేంద్రం బనగానపల్లెలోని ఆస్థానంలో హజరత్ అబ్బాస్ పీరు స్వాములు కొలువుదీరారు. సోమవారం నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. ముందుగా బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్ ఫజల్ అలిఖాన్ ఆధ్వర్యంలో ఆయన ఇంటి నుంచి భక్తి గీతాలు ఆలపిస్తూ ఆస్థానం వరకు పీర్లను తీసుకొచ్చారు. అనంతరం పీర్లను అందంగా ముస్తాబు చేశారు. పూలదట్టీలతో అలంకరించారు. తదనంతరం షీయా మతస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్ ఫజల్ అలిఖాన్ ఫాతేహాలు సమర్పించారు. మొహర్రం వేడుకల్లో భాగంగా ఈ నెల 14వ తేదీన చిన్న సరిగెత్తు, 15న మధ్య సరిగెత్తు, 17న జుర్రేరువాగులో పీర్ల నిమజ్జనంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. మొహర్రం వేడుకలు హైదరాబాద్ తర్వాత బనగానపల్లె పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతాయి. హిందూ, ముస్లింలు ఐకమత్యంగా భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహిస్తారు. మొహర్రం సందర్భంగా ఆస్థానాన్ని విద్యుత్ దీపాలంకారం చేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాగేశ్వరరావు



జెండాను ఆవిష్కరిస్తున ఈశ్వరయ్య

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని దండోరా కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఆదివారం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఇరికిమాను నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి నాగేశ్వరరావు జెండాను ఎగురవేసి భారీ కేక్ కట్ చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమం నేటితో 30 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు అలుపెరగని పోరాటం చేస్తామని నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మారెన్న, చిన్న పక్కీర, దస్తగిరి, రామచంద్రుడు, ఆదినారాయణ, బాల ఓబులేసు, గూటం అంజి, రామాంజనేయలు తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : ఎమ్మార్పీఎస్ 30వ వ్యవస్థాపక దినోత్సవం, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం స్థానిక కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులతో కలిసి జాతీయ నాయకుడు గుండాల ఈశ్వరయ్య మాదిగ ఎగురవేశారు. అదేవిధంగా కొండపేట, వెంటకనాయునిపల్లెలో ఎమ్మార్పీఎస్ ఆత్మ గౌరవ జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పులి కేశవయ్య, కోసనపల్లె రామాంజనేయులు, పులి పెద్దయ్య, సంజీవ, ఎంఎస్‌ఎఫ్ నాయకులు జయప్రకాష్, నూతనప్రసాద్, రాజేష్, మహేష్, మహీ, భరత్ తదితరులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వవిద్యార్థులు

'అ'పూర్వ' కలయిక

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1990–91 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒక వేదికపై చేరారు. హైదరాబాదు, బెంగళూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపార రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దాదాపు 34సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు సంతోషంగా గడిపారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులు ఓబులేసు, నాగేంద్రప్ప, సుబ్బారెడ్డి, జీవీ సుబ్బారెడ్డి, ముత్తోజ్ వీరబ్రహ్మం తదితరులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అమర్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, షర్ఫుద్దీన్, ప్రసాద్, తిరుపాలు, భరత్, అబ్దుల్‌హై తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే అంతే!

మండలంలోని టంగుటూరు గ్రామ సమీపంలో కల్వర్ట్‌పై పడిన గుంత ప్రమాదకరంగా మారింది. బనగానపల్లె నుంచి టంగుటూరు మీదుగా నంద్యాల జిల్లా కేంద్రానికి వెళ్లు ఈ ప్రధాన రోడ్డు నేషనల్ హైవే 544డి కిందికి వస్తుంది. కొన్ని నెలల క్రితం కల్వర్ట్‌కు సంబంధించిన వంతెన కూలిపోయి గుంత చిన్నగా ఏర్పడింది. రోజురోజుకు మరింత పెద్దదిగా మారింది. ఏ మాత్రం వాహనం అదుపు తప్పినా ప్రమాదానికి గురికావాల్సిందే. ఈ రోడ్డు నంద్యాల జిల్లా కేంద్రానికే కాకుండా ప్రకాశం, గుంటూరు, విజయవాడల పట్టణాలకు వెళ్లేందుకు ప్రధాన రోడ్డు. దీంతో నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఎక్కువ ఉంటుంది. గుంతపడిన ప్రాంతం సింగిల్ రోడ్డుగా ఉండడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందు పడాల్సివస్తుంది. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు లేకపోలేదు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి కనీసం మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు, వాహనచోదకులు కోరుతున్నారు.



టంగుటూరు గ్రామ సమీపంలో వంతెనపై ఏర్పడిన గుంత

–బనగానపల్లె రూరల్

భూ వివాదంతో వ్యక్తిపై దాడి



దాడిలో తీవ్రంగా గాయపడిన గొల్ల మాదయ్య

డోన్ టౌన్ : పట్టణ సమీపంలో వెంకటనాయునిపల్లె గ్రామంలో ఇద్దరి మధ్య నెలకొన్న భూ వివాదం కారణంగా ఆదివారం రాత్రి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇంద్రప్రకాష్ అలియాస్ ఇంద్రప్ప దాడిలో గొల్ల మాదయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు వీరిద్దరి మధ్య కొన్నిరోజులుగా పొలం గట్టు విషయంలో మనస్పర్థలు తలెత్తాయి. రాత్రి మాదయ్య నిందితుడు ఇంటి ముంగిట నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో ఇంద్రప్ప కొడవలితో దాడి చేశాడు. గాయపడిన గొల్ల మాదయ్యను కుటుంబ సభ్యులు డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. ఈ విషయాన్ని పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా దాడి జరిగిన విషయం వాస్తవమేనని, కారణాలపై విచారణ చేస్తున్నామన్నారు. గ్రామంలో ఏలాంటి చర్యలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఊరటిచ్చిన వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం రైతులకు ఊరట నిచ్చింది. జూన్ 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభవ్వగా ఆయా మండలాల పరిధిలో రైతులు 3,750 ఎకరాల్లో మొక్కజొన్న, మినుము, పెసర, ఉల్లి, పత్తి, పసుపు, తదితర రకాల పంటలు సాగు చేశారు. మొలక దశలో ఉండగా ఎదురు చూస్తున్న తరుణంలో కురిసిన వర్షం పైర్లకు ఊపిరి పోసింది. సాగు చేసిన పంటలతో పాటు సాగు చేయాల్సిన పంటలకు వర్షం అనుకూలమని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో జిల్లా కలెక్టర్ రాజకుమారి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి దంపతులు పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అష్టవిధ మహామంగళ హారతుల సమయంలో దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, వేదపండితులు రవిశంకర అవధాని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. దర్శనం అనంతరం అలంకార మండపంలో కలెక్టర్ దంపతులకు వేద పండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

ఏదారి...ఎటుపోతుంది?



కనిపించని మార్గాలను సూచించే బోర్డు

బనగానపల్లె : మండల కేంద్రం బనగానపల్లెకు రెండుకిలోమీటర్ల దూరంలో ఉన్న మూడురోడ్ల కూడలి (టంగుటూరు క్రాస్‌రోడ్) ప్రయాణికులను తికమకపెడుతుంది. ఈ కూడలిలో బనగానపల్లె, నంద్యాల, టంగుటూరు రోడ్లు కలుస్తాయి. రెండుదారుల నుంచి నంద్యాలకు వెళ్లొచ్చు. అయితే పాణ్యం మీదుగా వెళ్లే పది కిలోమీటర్లు దూరం పెరుగుతుంది. అయితే నేమ్‌బోర్డు దిమ్మె చాలా కాలంగా పతనావస్థకు చేరుకోవడంతో ఏ దారి ఎటుపోతుందో అర్థమవ్వక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజల విషయం అటుంచితే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులకు సమస్యగా మారింది. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి నేమ్‌బోర్డు దిమ్మెతోపాటు స్పష్టంగా మార్గాల సూచికలు ఏర్పాటు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విస్తారంగా వరినారుమళ్లు



ఎక్కువ విస్తీర్ణంలో సాగైన వరి నారుమళ్లు

బనగానపల్లె: ఖరీఫ్‌లో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరి పంటసాగుకు మొగ్గు చూపుతున్నారు. గత 15 రోజులుగా వరినారుమళ్లను విస్తారంగా సాగు చేస్తున్నారు. గతేడాది ఖరీఫ్‌లో సాగు చేసిన బీపీటీ 5204, నంద్యాల సోనా మంచి దిగుబడి వచ్చింది. గిట్టుబాటు ధర కూడా లభించడంతో ఈయేడూ వరిసాగుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. గతంలో ఎన్నడులేని విధంగా ప్రస్తుతం నంద్యాల సోనా గిట్టుబాటు ధర 75 కిలోలకు రూ.2800, బీపీటీ 5204 చొప్పుల వచ్చింది. గత సంవత్సరం ఖరీఫ్‌లో నియోజక వర్గంలో సుమారు 18వేల హెక్టార్లలో రైతులు వ్యవసాయ బోర్ల ఆధారంగా సాగు చేశారు. రబీలోనూ 11వేల హెక్టార్లలో వరి పంటను సాగు అయ్యింది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఈ సాగు విస్తీర్ణం సుమారు 25వేల హెక్టార్ల వరకు ఉంటుందని వ్యసాయాధికారులు పేర్కొంటున్నారు. వరి పంటకు పూర్తిగా గిట్టుబాటు ధర ఉండడం వల్లనే సాగు విస్తీర్ణం పెరిగేందుకు ప్రధాన కారణమైంది. మరో 15 రోజుల్లో రైతులు వరినాట్లు వేయనున్నారు. ఈ మేరకు అవసరమైన ఎరువులను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకుంటున్నారు.